క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33 కేవీ పులివెందుల సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ కింద ఉన్న ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం కడప రోడ్డు ఫీడర్ కింద చెట్లు కొట్టే కార్యక్రమం ఉండటం వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కమనీయం.. కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో వెలసిన శ్రీ గోదా, మహాలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ చతుర్థశ వార్షికోత్సవ, బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీ గోదా మహాలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. రెండు రోజులు పాటు ఆలయంలో సుప్రభాత సేవతో పాటు వివిధ రకాల, అభిషేకాలు, హోమాలు జరిగాయి. శ్రీవారి కల్యాణం అనంతరం సాయంత్రం గ్రామోత్సవంను వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేడు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఉంటుందని ఎంఈవోలు చౌడయ్య, శివజ్యోతి తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి...ఏ విధంగా తయారు చేయాలనే విషయాలపై శిక్షణ ఉంటుందన్నారు. అందరూ తప్పక హాజరు కావాలన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

జమ్మలమడుగు : పట్టణంలో ఎన్టీ రామారావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. 101వ జయంతిని పురస్కరించుకుని స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

గజవాహనంపై చెన్నకేశవుడు



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున చెన్నకేశవస్వామి, మహాలక్ష్మీదేవిల మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలతో అలంకరించారు. సాయంత్రం స్వామివారిని గజవాహనంపై శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను పురవీధుల్లో గోవింద నామ స్మరణల మధ్య ఘనంగా ఊరేగించారు. దారివెంబడి భక్తులు కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కాగా బుధవారం ఉదయం చెన్నకేశవస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

కౌంటింగ్ నిబంధనలు పాటించాల్సిందే

మైదుకూరు : ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని మైదుకూరు నియోజకవర్గ అధికారి ఎస్.చంద్రమోహన్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఎన్నికల కౌంటింగ్‌పై అన్ని పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనే రాజకీయ పార్టీల, ఇండిపెండెంట్ అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలను పాటించి సహకరించాలని కోరారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎం కౌంటింగ్ నందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారి వై.నరేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం



కమలాపురంలో ర్యాలీ చేస్తున్న మహిళలు, వివిధ శాఖల సిబ్బంది



వల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది

కమలాపురం : మహిళలు నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ షంషాద్ బేగం తెలిపారు. మంగళవారం వరల్డ్ మెన్‌స్ట్రువల్ హైజీన్ డేను పురస్కరించుకుని స్థానిక ఐసీడీఎస్ సభా భవనంలో కిషోర బాలికలు, తల్లులకు సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాల్సిన అవసరం, పాటించకపోతే వచ్చే ప్రమాదాల గురించి అందరిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. నెలసరి సమయంలో మహిళలను అంటరాని వారిలాగా చూసే సంస్కృతి ఇంకా చాలా మందిలో ఉందన్నారు. ఇది సాంఘికంగా చాలా అన్యాయమన్నారు. అలాంటి సమయంలో మహిళలు, కిషోర బాలికలకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలన్నారు. ఆ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం అని, శానిటరీ నాప్కిన్స్ వాడకం విధిగా పెట్టుకోవాలన్నారు. అనంతరం వాటిని పేపరులో గాని, కవర్‌లో గాని చుట్టి కాల్చివేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుబ్బమ్మ, భారతి, జయకుమారి, వెలుగు ఏపీఎం అపర్ణదేవి, ఏఎన్ఎం.షబానా, ఆశా బేబి, అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : యుక్త వయసు బాలికలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం వుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు ప్రసన్నలక్ష్మి తెలిపారు. వల్లూరులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కిషోర బాలికలకు ఋుతుక్రమం–ఆరోగ్యం– పరిశుభ్రత అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. యుక్త వయసు బాలికలు ఇంటి వద్ద, స్కూలు వద్ద ఎలా వుండాలి, పరిశుభ్రత ఎలా పాటించాలి, ఆ సమయంలో ఎదురయ్యే మానసిక సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ముఖ్యంగా గర్భ సంచి క్యాన్సర్ లాంటివి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం వుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు రాచమ్మ, పార్వతమ్మ, సీహెచ్‌వో వేణు గోపాల్‌రావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పరిశుభ్రత పాటిస్తే అంటు వ్యాధులు దూరమౌతాయని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హర్షిత, సీడీపీఓ శ్రీలతలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని భాకరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశం నిర్వహించారు. భాకరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శాంతకుమార్ మాట్లాడుతూ పరిశుభ్రత దినోత్సవ సందర్భంగా పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దరిచేరకుండా ఉంటాయని కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్త్రీలు రుతుక్రమ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యురాలు లక్ష్మి ప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 7వ సచివాలయంలో రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా స్త్రీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా రుతుక్రమంలో శానిటరీ నాప్కిన్స్ వాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. అలాగే స్త్రీలు మంచి పోషకాహారం, పరిశుభ్రమైన తాగునీరు తీసుకోవాలన్నారు. రుతుక్రమంలో ఎక్కువగా రక్త స్రావం అయినచో నైపుణ్యమైన డీజీఓలు అనగా గర్భకోశ వైద్యులను సంప్రదించాలన్నారు. టుగెదర్ ఫర్ పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్ అనగా స్నేహపూర్వక ప్రపంచం కోసం కలిసి పోదాం అని అర్థమన్నారు. పాఠశాలల్లోనూ, స్త్రీలు పనిచేసే ప్రదేశాల్లోనూ, కళాశాలల్లోనూ, ఎక్కడైనా స్త్రీలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో వారి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించి వారిని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు అరుణాదేవి, వెంకటలక్ష్మమ్మ, ఫకృద్దీన్, సీహెచ్ఓ వెంకటరత్నం, సీడీపీఓ సునీత, ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, ఏఎన్ఎం భారతి, లక్ష్మిదేవి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు స్వర్ణలత, హసీనా, టీచర్లు సుభద్ర, నాగరత్న, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.



చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. మంగళవారం ఆరోగ్యం – పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మెరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, అంగన్‌వాడీ అధికారులు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రతి రోజు భోజన సమయంలో తమ చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారిణి రాజేశ్వరి, సూపర్‌వైజర్ గౌసియా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రుతుక్రమం–పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, కిషోరబాలికలతో మండల వైద్యాధికారి మహమ్మద్ తాహా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళలకు నెలసరి సర్వ సాధారణమని పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరికి చేరకుండా ఉంటాయని ఈ విషయాన్ని కిశోర బాలికలు గుర్తుంచుకోవాలని సూచించారు. అంతే కాకుండా గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు జయలక్ష్మి, లక్ష్మిదేవి, సీహెచ్ఓ రంగనాథ్, హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, పీహెచ్ఎన్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యులు రాఘవేంద్ర, సునీతల ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి అనంతరం మండల పరిధిలోని ఆజాద్‌నగర్‌లో ర్యాలీని నిర్వహించి మాట్లాడారు. నెలసరి సమయంలో ఎదుర్కొనే ఇబ్బందులు, వాటి నివారణ, పాటించవలసిన పరిశుభ్రతపై అవగామన కల్పించారు. సామాజిక ఆరోగ్య అధికారి సుకుమార్, సిబ్బంది, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు శ్రీదేవి, సిబ్బంది, కిశోర బాలికలు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రుతుక్రమం–పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి పాల్గొని మాట్లాడారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, వైద్య సిబ్బందితో స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి పలు పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. రుతుక్రమ సమయంలో విశ్రాంతి, వ్యక్తిగత పరిశుభ్రత, మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే ఐసీడీఎస్ సూపర్ వైజర్లు గురమ్మ, నాగరత్నమ్మలు మాట్లాడుతూ అంగన్‌వాడీలో ఇచ్చే ఐరన్ మాత్రలు, పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, వీవోఏలు, కిశోరి బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పులివెందులలో కిశోర బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



వేంపల్లెలో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు



చింతకొమ్మదిన్నెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వేరుశనగ విత్తనాలు పంపిణీ



లింగాల : పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి

లింగాల : మురారిచింతల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న వేరుశనగ విత్తన పంపిణీని పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంగళవారం విత్తన నమోదు చేసుకున్న రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. మండలంలో ఇప్పటివరకు 259 మంది రైతులకు గానూ 227 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలకు రైతులు నమోదు చేసుకున్నారన్నారు. వేరుశనగ సాగుచేసే రైతులు సమీపాల్లో ఉన్న రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి బయోమెట్రిక్ ద్వారా వేరుశనగ కాయలను పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమేష్, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జి గోపీ, తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందిస్తున్న విత్తన పంపిణీ కార్యక్రమం సోమవారం ఎస్.పాలగిరి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ప్రారంభించారు. పంపిణీ కార్యక్రమాన్ని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తనిఖీ చేశారు. మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 394 మంది రైతులకు గాను 350 క్వింటాళ్ల విత్తన కాయలకు రైతులు నమోదు చేసుకున్నారన్నారు. పంట సాగు చేసేందుకు సుముఖంగా ఉండి ఇంత వరకూ నమోదు చేసుకోని రైతులు ఉంటే రైతు భరోసా కేంద్రానికి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి బయో మెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. పంటలు సాగు చేయు రైతులు తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో వారికి అవసరమైన ఎరువులు కూడా పొందవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తొండూరులో..

తొండూరు : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండల రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తన నమోదు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 608 హెక్టార్ల విస్తీర్ణంకు గానూ 550 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు చేశామన్నారు. వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రానికి వెళ్లి ఆధార్, పాసుపుస్తకం, మొబైల్ తీసుకుని వెళ్లాలని సూచించారు. అర్ధ ఎకరా ఉన్న వారికి ఒక బస్తా, ఒక ఎకరా ఉన్న వారికి రెండు బస్తాలు, ఎకరా కంటే ఎక్కువ ఉన్నవారికి మూడు బస్తాలు గరిష్టంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విత్తన పంపిణీ కార్యక్రమం ఈనెల 30వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

31 నుంచి హనుమాన్ జయంతి మహోత్సవాలు

వేంపల్లె : స్థానిక పాపాఘ్నినది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి అనుసంధానమైన ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 31నుంచి హనుమాన్ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కురాకుల వెంకటేష్, అర్చకులు హరిప్రవీణ్‌లు తెలిపారు. 31వ తేదీన శుక్రవారం గణపతి పూజతో మొదలై ఆంజనేయస్వామి మూలవరులకు అభిషేకం, అలంకరణ ఆరాధన చేస్తారన్నారు. అనంతరం గణపతి హోమం, నవగ్రహ హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహిస్తారన్నారు. జూన్ 1వ తేదీ శనివారం ఉదయం సుప్రభాతం, దేవత ఆరాధన, కలిషారాధన, మూర్తి హోమం, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రాసద వినియోగం ఉంటుందన్నారు. అంతేకాకుండా హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి నూతన కవచముతో దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని నాగార్జున ఐటీఐలో మంగళవారం ఐల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం 45 మంది నిరుద్యోగ అభ్యర్థులను కొప్పర్తి సమీపంలోని టెక్నాలజీస్ కంపెనీకి ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. వీరిని విద్యార్హత, అనుభవం ఆధారంగా ఎంపిక చేశామని తెలిపారు.

గణితశాస్త్రం నిత్య జీవితంలో అవసరం



అట్లూరు: విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్

చాపాడు : సమాజంలో గణితశాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, అది నిత్యజీవితంలో ఎంతో అవసరం అని గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి తరగతులలో భాగంగా 20 మంది విద్యార్థులకు పది రోజులుగా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజూ ఒక అంశంపై విద్యార్థులకు బోధించటం జరుగుతుందన్నారు. చదువుతో పాటు కథలు, పుస్తకాలు చదువటం, అల్లికలు నేర్పించటం, చిత్ర లేఖనం గీయించటం ఇలా అనేక రకాలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారి తెలిపారు.

విద్యతో పాటు యోగా తప్పనిసరి

అట్లూరు : విద్యార్థులకు విద్యతో పాటు యోగా కూడా తప్పనిసరి అని గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణా కార్యాక్రమంలో భాగంగా 6,7,8. తరగతుల విద్యార్థులకు వ్యాయామం, యోగాతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూన్ 7వ తేదీన బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు.

ఏడు దాటితే అనుమతించం

- రాజకీయ పార్టీల నేతల సమావేశంలో జేసీ గణేష్‌కుమార్



మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్



హాజరైన రాజకీయ పార్టీల నాయకులు

కమలాపురం : జూన్ 4న సాధారణ ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి ఏజెంట్లు ఉదయం 7 గంటలలోపే చేరుకోవాలని, ఏడు దాటితే లోనికి అనుమతించమని ఆర్ఓ గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో జూన్ 4న కడపలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ యూనివర్శిటీలో జరిగే కౌంటింగ్ గురించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీ నిబంధనల మేరకే కౌంటింగ్ జరుగుతుందని, ఎవరూ అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఒక్కో టేబుల్‌కు 5 మంది ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం గదులు చాలా ఇరుకుగా ఉన్నాయన్నారు. అందుకు కేవలం 5 మందిని మాత్రమే అనుమతిస్తామన్నారు. పార్లమెంటు కౌంటింగ్ కేంద్రం పెద్దదిగా ఉండటంతో టేబుల్‌కు 9 మందిని అనుమతిస్తామన్నారు. 7 గంటల్లోపే ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని 7 దాటితే లోపలికి అనుమతించమన్నారు. 8 గంటలకు ఏజెంట్ల ముందే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభిస్తామని, 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభిస్తామన్నారు. ఏజెంట్లను లాటరీలో వచ్చిన విధంగా టేబుళ్ల వద్ద కూర్చోబెడతామన్నారు. ఇందులో ఏలాంటి దాపరికం, ఏలాంటి అపోహలు లేకుండా నిష్పక్షపాతంగా కౌంటింగ్ చేపడతామన్నారు. ఈవీఎంలు పనిచేయకపోతే బ్యాటరీలు మారుస్తామని, అప్పటికి పని చేయకపోతే వీవీ ప్యాట్‌ను కౌంట్ చేస్తామన్నారు. ఎవరూ ఎలాంటి గాబరా పడాల్సిన అవసరం లేదన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించబోమని, సీక్రెట్ కెమెరాలు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్‌లో ఎవైన అనుమానం వస్తే తక్షణం చెప్పాలని, పూర్తి అయ్యాక చెబితే మరలా కౌంటింగ్ చేయాలంటే చాలా కష్టమైన పని అన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులు సహకరిస్తే కౌంటింగ్ సజావుగా సాగుతుందన్నారు. ఏఆర్ఓ సుబ్రహ్మణ్యం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

31న పర్యావరణ పరిరక్షణపై పోటీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితి స్థాపకత', పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై ఈ నెల 31న విద్యార్థులకు వ్యాస రచన, ప్రసంగం, క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి , పర్యావరణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని కోటిరెడ్డి రామసుబ్బమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ పోటీల్లో 6 నుండి 10 వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ విద్యార్థుల వరకు రెండు విభాగాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థులు వారి పేరు, విద్యా సంస్థ, తరగతి, ఫోన్ నెంబర్ తదితర వివరాలను 81794 54953 నెంబర్ కు పంపాలని సూచించారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న సుంకులమ్మ అమ్మవారు

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 27వ తేదీ నుంచి జరుగుతున్న సుంకులమ్మ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని రెండోరోజు మంగళవారం అమ్మవారి మూల విగ్రహాలకు విశేష పంచామృత అభిషేకములు, మహాలక్ష్మీ, మహా సరస్వతి, నవగ్రహ మహా గణపతి పూజ, అభిషేకములు, అవాహిత హోమములు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం ప్రదోశకాల పూజలు, పంచ అష్టోత్తరము, అమ్మవారికి కుంకుమార్చనలు, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. కాగా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

మధ్యాహ్న భోజనంలో ఏజెన్సీల పాత్ర ముఖ్యమైనది



వేంపల్లెలో మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారి సి.ఎస్.జాఫర్ సాదిక్



చెన్నూరులో వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ గంగిరెడ్డి

వేంపల్లె : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంలో వంట ఏజెన్సీల పాత్ర ప్రాముఖ్యమైనదని మండల విద్యాశాఖ అధికారి సి.ఎస్.జాఫర్ సాదిక్ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వహణపై నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలను తీసుకుని నీటితో శుభ్రం చేసి వంటలు చేయాలన్నారు. అంతేకాకుండా పిల్లలకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలని సూచించారు. ప్రభుత్వం అందించే మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు హాజరు శాతం పెరుగుటకు ప్రముఖ పాత్ర వహిస్తోందన్నారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ఖచ్చితంగా పాటించాలన్నారు. మధ్యాహ్నం భోజనం మెనూలోని పోషక విలువలు, సమతుల్య ఆహారం ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ ఆరు రోజుల మెనూ అంశాలను ఏ విధంగా తయారు చేయాలో వీడియోలు ప్రదర్శిస్తూ తెలియజేశారు. అనంతరం రాష్ట్రస్థాయిలో శిక్షణ తీసుకున్న లింగాల ప్రాథమిక పాఠశాల వంట ఏజెన్సీ నిర్వాహకురాలు ఉమాదేవి తీసుకున్న శిక్షణ విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్పీలు భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వంట ఏజెన్సీ నిర్వాహకులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ

చెన్నూరు : మండలంలోని వంట ఏజెన్సీ నిర్వాహకులు, హెల్పర్లకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం రీసెర్చ్ పర్సన్ వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు వంట విధానం, పరిశుభ్రత, తీసుకోవలసిన జాగ్రత్తలు వంటి వాటిపై వారికి అవగాహన కల్పించారు. ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మిడ్ డే మీల్స్ మెనూ ప్రకారం ఉండాలన్నారు.

అలాగే మీ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం హెల్పర్లకు వంటలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సునీత, హెడ్మాస్టర్ పద్మనాభం, వంట ఏజెన్సీలు, హెల్పర్లు పాల్గొన్నారు పాల్గొన్నారు.